
చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

చిరు వ్యాపారాలు తొలగించడం గర్హనీయం: ఎమ్మెల్యే

హైదర్‌నగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): 30 ఏళ్లుగా రోడ్డు పక్కన చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్న వారి దుకాణాలను జీహెచ్ఎంసీ, పోలీస్ అధికారులు తొలగించడం గర్హనీయమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలోని కేపీహెచ్‌బీ కాలనీలో రైతుబజార్, తహసీల్దార్ కార్యాలయం ప్రాంతాల్లో భారీ పోలీస్‌బందోబస్తుతో మున్సిపల్ అధికారులు రోడ్డు ఆక్రమణలు తొలగించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద కుటుంబాల వారు చిరు వ్యాపారాలు పెట్టుకొని జీవనం సాగిస్తున్న క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం వారి వ్యాపారులను తొలగించడం బాధాకరమైన విషయమన్నారు. జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల దగ్గరికి వెళ్లి ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మూసాపేట డీసీ రమేష్, కేపీహెచ్‌బీ సీఐ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై గుంతలను పూడ్చాలి


గుంతలమయంగా మండల ఆఫీసు రోడ్డు

గాజులరామారం, మే 21(ఆంధ్రజ్యోతి): గాజులరామారం డివిజన్ దేవేందర్‌నగర్‌లోని కుత్బుల్లాపూర్ మండ ల ఆఫీసుకు వెళ్లే రోడ్డు గుంతలతో అధ్వానంగా మారింది. వర్షం వచ్చిందంటే ఈ రోడ్డుపై మోకాలు లోతు వరకు వర్షపు నీరు నిలుస్తోంది. దీంతో రోడ్డు పై రాకపోకలు సాగించే వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం ద్విచక్ర, భారీ వాహనాలు సైతం కూకట్‌పల్లి నుంచి దేవేందర్‌నగర్ మీదుగా కైసర్‌నగర్, దుండిగల్‌కు, షాపూర్‌నగర్ నుంచి గాజులరామారం మీదుగా దేవేందర్‌నగర్ చౌరస్తా, ప్రగతినగర్ వరకు రాకపోకలు సాగిస్తుంటాయి. ముఖ్యంగా దేవేందర్‌నగర్ చౌరస్తా నుంచి కుత్బుల్లాపూర్ మండల ఆఫీసు వరకు రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వీటి కారణంగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.


సప్తగిరికాలనీలో ఎమ్మెల్యే గాంధీకి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

వివేకానందనగర్‌కాలనీ, మే 21 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యానగర్‌కు చెందిన కాలనీవాసులు మంగళవారం సప్తగిరికాలనీలోని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని కలుసుకుని తమ కాలనీలో సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రం అందజేశారు. పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్ల నిర్మాణం, కరెంట్ సరఫరాలో అంతరాయాలు, వీధిదీపాల సమస్యలు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వినతిపత్రంలో పేర్కొన్న సమస్యలన్నింటిని పరిష్కరించేలా కృషి చేస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్, ఖాసీం, అలీ, ఇమ్రాన్, మహ్మద్ అమీర్, మోహిన్, అస్లాం, ఏడుకొండలు, శ్రీనివాసరావు, దస్తగిరి, విశ్వనాథ్, తులసీప్రసాద్ పాల్గొన్నారు.

బహిర్భూమికి వెళ్లి.. చెరువులో శవమై..

దుండిగల్, మే 21(ఆంధ్రజ్యోతి): బహిర్భూమికి వెళ్లిన వ్యక్తి చెరువులో శవమై కనిపించారు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్, అనకాపల్లి జిల్లా, విజయరామరాజుపేటకు చెందిన శేరడం నగేష్ (45) కుటుంబసభ్యులతో కలిసి నగరానికి వచ్చి గుండ్లపోచంపల్లిలో ఉంటూ వెల్డింగ్ పనులు చేసుకుంటున్నాడు. అయితే ఈనెల 19న రాత్రి బహిర్భూమికి వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి తిరిగి రాలేదు. మంగళవారం గుండ్లపోచంపల్లి నారాయణ చెరువులో శవమై కనిపించాడు. గమనించిన స్థానికులు పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు, కార్మిక సంఘాల నాయకులు

విద్యుత్ కార్మికుడికి న్యాయం చేయాలి

హైదర్‌నగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతులు చేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందిన విద్యుత్ కార్మికుడు ఆనంద్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ కేపీహెచ్‌బీ కాలనీలోని డివిజనల్ ఇంజనీర్ కార్యాలయం ఎదుట మృతుడి బంధువులు, కార్మిక సంఘాల నాయకులు మృతదేహంతో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మీటర్ రీడర్‌గా పని చేస్తున్న ఆనంద్‌ను నిబంధనలకు విరుద్ధంగా ఏఈ విద్యుత్ మరమ్మతు పనులకు పంపించాడని, అధికారుల నిర్లక్ష్యంతోనే అతడు మృతి చెందాడని ఆరోపించారు. మృతుడి కుటుంబానికి నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు. కూకట్‌పల్లి ఏసీపీ శ్రీనివాసరావు, కేపీహెచ్‌బీ సీఐ వెంకటేశ్వరరావు పరిస్థితిని సమీక్షించి ఆందోళన చేస్తున్న వారికి సర్దిచెప్పి పంపించారు. కొండాపూర్ రాఘవేంద్ర కాలనీలో 11 కేవీ లైన్ మరమ్మతు చేస్తూ ఆనంద్ అనే విద్యుత్ కార్మికుడు సోమవారం మృతి చెందిన విషయం తెలిసిందే..


చర్చా కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్త చాన్

స్టెమ్‌సెల్ చికిత్సతో విప్లవాత్మక మార్పులు!

• శాస్త్రవేత్త డాక్టర్ మైక్ చాన్

హైదరాబాద్ సిటీ, మే 21 (ఆంధ్రజ్యోతి): స్టెమ్‌సెల్ చికిత్సతో ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని శాస్త్రవేత్త, స్టెమ్‌సెల్స్, ఇమ్యునాలజీ, రీసెర్చ్ మెడిసన్ రచయిత, ఈడబ్ల్యూబీజీ ఫౌండర్ ప్రొఫెసర్ డాక్టర్ మైక్ చాన్ పేర్కొన్నారు. వ్యక్తి ఆరోగ్య పరిస్థితులకు తగినట్లుగా ప్రత్యేక చికిత్స అందిస్తున్నట్టు ఆయన తెలిపారు. యూరోపియన్ వెల్‌నెస్ బయోమెడికల్ గ్రూప్ (ఈడబ్ల్యూబీజీ) మంగళవారం గచ్చిబౌలిలోని ఐఐటీ క్యాంపస్‌లో విద్యార్థులతో చర్చా కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా చాన్ మాట్లాడుతూ.. వ్యక్తుల అవసరాలను గుర్తించి అందుకనుగుణంగా చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఐటీ విద్యార్థులు, సినీ నిర్మాత ఏ.ఎం.రత్నం, జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ, ఈడబ్ల్యూబీజీ భారత్ సైంటిఫిక్ రీసెర్చ్, డైరెక్టర్, సీఈఓ డాక్టర్ రవితేజ అల్లం, సీనియర్ మెడికల్ అడ్వైజర్ ప్రొఫెసర్ ఓల్గా నిశాకుమ్మై తదితరులు పాల్గొన్నారు.

ఫైర్ సేఫ్టీ ఏదీ?

- ప్రమాదం జరిగితే.. ఎవరిది బాధ్యత?
- శానిటరీ నాప్కిన్స్ యంత్రంలో పొగలు
- అస్తవ్యస్తంగా విద్యుత్ తీగలు
- కాలం చెల్లిన అగ్నిమాపక సిలిండర్లు
- ఇదీ కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో పరిస్థితి

కుత్బుల్లాపూర్, మే 21 (ఆంధ్రజ్యోతి): అది కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయం. సర్కిల్ పరిధిలో ఏ బహుళ అంతస్తు భవనం నిర్మాణంలోనైనా ఫైర్ సేఫ్టీ గురించి పరిశీలించేది ఈ అధికారులే.. కానీ ఈ సర్కిల్ కార్యాలయంలో ఎక్కడ చూసినా ఫైర్ సేఫ్టీ విషయంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. కార్యాలయంలో ఎక్కడ చూసినా అస్తవ్యస్తంగా కనిపిస్తున్న విద్యుత్ తీగలే దర్శనమిస్తున్నాయి. వీటి నుంచి ఎప్పుడు ఏ ప్రమాదం వస్తోందో తెలియని పరిస్థితి. విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నా వాటి గురించి పట్టించుకునే నాథుడే కరువయ్యారు. నిర్లక్ష్యం కారణంగా ఏదైనా సంఘటన జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని కార్యాలయానికి వచ్చిన ప్రజలకు సందేహం కలుగుతోంది.


సర్వర్ గదిలో అస్తవస్తంగా తీగలు

• మరుగుదొడ్డిలో పొగలు

సర్కిల్ కార్యాలయంలోని మహిళల మరుగుదొడ్డిలో ఎన్నికల సమయంలో శానిటరీ నాప్కిన్ యంత్రాలను ఏర్పాటు చేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా సదరు యంత్రం నుంచి శుక్రవారం పొగ వెలువడి చుట్టుపక్కల గదులను కమ్మేసింది. దీంతో కంగారు పడిన అధికారులు, సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఆ యంత్రానికి ఉన్న విద్యుత్ కనెక్షన్‌ను తొలగించడంతో సమస్య పరిష్కారమయింది.


పొగలు వస్తున్న శానిటరీ నాప్కిన్ యంత్రం



కాలం చెల్లిన అగ్నిమాపక సిలిండర్లు

• పద్మవ్యూహంలా విద్యుత్ తీగలు

కార్యాలయంలో ఎటు చూసినా విద్యుత్ తీగలు అస్తవ్యస్తంగా పద్మవ్యూహంలా కనిపిస్తున్నాయి. విద్యుత్ తీగలు, ఇంటర్‌నెట్ తీగలతో పాటు ఇతర తీగలు చిందరవందరగా బయటికి వేలాడుతూ కనిపిస్తున్నాయి. అంతేకాకుండా తీగలకు కనెక్షన్లు అన్నీ సరైన పద్ధతిలో ఇవ్వకుండా తూతూమంత్రంగా చేశారు. దాంతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం లేకపోలేదు. అంతేకాకుండా కార్యాలయంలో ఎక్కడ చూసినా ఊడిపోయిన స్విచ్ బోర్డులు, కాలిపోయిన ఎంసీబీలు, ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు కనిపిస్తున్నాయి. ఇవన్నీ అధికారులు కానీ.. సిబ్బంది కానీ పట్టించుకోకపోవడం విశేషం.

• కాలం చెల్లిన అగ్నిమాపక సిలిండర్లు

సర్కిల్ పరిధిలో ఎక్కడే ఏ బహుళ అంతస్తుల భవనంలోనైనా అగ్నిమాపక రక్షణ వ్యవస్థ (ఫైర్ సేఫ్టీ సిస్టం), సిలిండర్లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశాలను జారీ చేస్తారు. అనంతరం పరిశీలించి నిబంధనలు పాటించని యజమానులకు జరిమానాలు విధిస్తారు. కానీ అధికారులు తమ సర్కిల్ కార్యాలయాలో ఫైర్ సేఫ్టీపై నిర్లక్ష్యం వహించడం విడ్డూరంగా ఉంది. కుత్బుల్లాపూర్ సర్కిల్ కార్యాలయంలో అగ్నిమాపక సిలిండర్లను ఏర్పాటు చేశారు. అయితే.. వాటి గడువు 2023 మే 15వ తేదీతో ముగిసింది. గడువు ముగిసి సంవత్సరం పూర్తయినా వాటి గురించి పట్టించుకొనే స్థితిలో అధికారులు లేరు. శుక్రవారం జరిగిన షార్ట్ సర్క్యూట్ వల్ల ఎటువంటి ప్రమాదం జరగలేదు. ఒక వేళ ఏదైనా పెద్ద ప్రమాదం జరిగితే కాలం చెల్లిన అగ్నిమాపక సిలిండర్లతో ప్రమాదాన్ని ఎలా నివారించగలరని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఈ సర్కిల్ కార్యాలయంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ఆర్వో కార్యాలయంగా, పార్లమెంటు ఎన్నికలకు ఏఆర్వో కార్యాలయంగా ఉపయోగించారు. అప్పుడు కూడా సర్కిల్ అధికారులు కానీ.. అటు ఎన్నికల అధికారులు కానీ వీటిపై దృష్టి సారించకపోవడం ఇక్కడ కొసమెరుపు.


స్కూల్‌ను సీజ్ చేస్తున్న ఎంఈఓ వసంతకుమారి

శ్రీచైతన్య స్కూల్ సీజ్

జీడిమెట్ల, మే 21 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ జీడిమెట్ల వెన్నెలగడ్డలో ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న శ్రీచైతన్య స్కూల్‌ను ఎంఈఓ వసంతకుమారి మంగళవారం సీజ్ చేశారు. గతంలో అనుమతి లేకుండా అడ్మిషన్‌లు చేపడుతున్నారని విద్యాశాఖ అధికారులు సీజ్ చేసినా, పెడచెవిన పెట్టిన శ్రీచైతన్య యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్‌లు చేపట్టడంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎంఈఓ వసంతకుమారి, ఎంఎల్‌ఓ రమేష్‌లు స్కూల్‌ను సీజ్ చేశారు.

వివాహిత ఆత్మహత్య

హైదర్‌నగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డునెంబర్ 3లో ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై సుమన్ తెలిపిన వివరాల ప్రకారం కేపీహెచ్‌బీ రోడ్డునెంబర్ 3లో కొంతలపల్లి శివార్జున్, భార్య మాధురి(32) ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం ఉంటున్నాడు. మాధురి బ్యూటీషియన్‌గా పని చేస్తుంది. ఈ క్రమంలో మాధురి తరుచూ విశ్వనాథ్‌రెడ్డి అనే యువకుడితో పరిచయం ఏర్పడి తరుచూ ఫోన్‌లో మాట్లాడుతుండేది. గుర్తించిన శివార్జున్ భార్య మాధురిని పద్ధతి మార్చుకోవాలని పలుమార్లు హెచ్చరించాడు. అయితే విశ్వనాథ్‌రెడ్డి కొన్ని రోజుల క్రితం తాను ఉంటున్న హాస్టల్ ఖాళీచేసి వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన మాధురి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎగ్జిబిషన్‌లో జలకన్యల సందడి

కూకట్‌పల్లి, మే 21 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని మెట్రో ట్రక్ పార్కింగ్ మైదానంలో కొనసాగుతున్న అండర్ వాటర్ మెరైన్ ఎగ్జిబిషన్‌లో మంగళవారం జలకన్యల వేషధారణలతో మహిళలు అలరించారు. ఎగ్జిబిషన్ నిర్వాహకులు రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. స్పెయిన్ దేశానికి చెందిన పలువురు మహిళలను తీసుకొచ్చి జలకన్యల వేషధారణలతో వాటర్‌లో అలరించే ఏర్పాటు చేశామన్నారు. ఎగ్జిబిషన్‌కు వచ్చి సందర్శకులకు వినూత్న అనుభూతి కల్పించేందుకు తొలిసారిగా కూకట్‌పల్లి ఎగ్జిబిషన్‌లో జలకన్యలు, స్కూబా డైవింగ్ అవకాశం కల్పించామన్నారు. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుందని తెలిపారు.


జలకన్యల వేషధారణలతో విదేశీ మహిళలు

రేలంగి నరసింహారావుకు దాసరి పురస్కారం

రవీంద్రభారతి, మే 21 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, దాసరి నారాయణరావులు తెలుగు జాతికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చిన మహనీయులని వక్తలు అభివర్ణించారు. మంగళవారం రవీంద్రభారతిలో సీల్‌వెల్ కార్పొరేషన్, శృతిలయ ఫౌండేషన్, శ్రీభారతి మ్యూజిక్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఎన్టీఆర్, ఏఎన్నార్, కృష్ణ, దాసరి నారాయణరావులకు స్వరనీరాజనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావుకు దాసరి నారాయణరావు పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్‌గుప్తా హాజరై పురస్కార గ్రహీత రేలంగి నరసింహారావును ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు సినీ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే ఎన్టీఆర్, ఏఎన్నార్, దాసరిలను స్మరించుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో సీల్‌వెల్ అధినేత బండారు సుబ్బారావు, సీనియర్ జర్నలిస్టు మహ్మద్ రఫీ, కుసుమ భోగరాజు, రామకృష్ణ, గాయని వేమూరి మంజుల పాల్గొన్నారు. సభకు ముందు ప్రముఖ గాయని ఆమని నేతృత్వంలో నిర్వహించిన సీల్‌వెల్ సుస్వరాలు ప్రేక్షకుల్ని అలరించాయి. చక్కటి గీతాలాపనతో సినీ ప్రముఖులకు స్వరనీరాజనం పలికారు.


రేలంగి నరసింహారావును సత్కరిస్తున్న అతిథులు


చందన ఆలయంలో కొలువుతీరిన నర్సింహ స్వామి మూల విగ్రహం

లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

భెల్‌కాలనీ, మే 21 (ఆంధ్రజ్యోతి): భెల్ టౌన్‌షిప్‌లోని అభిషేక లక్ష్మీనర్సింహస్వామి దేవాలయంలో వారంరోజుల పా టు నిర్వహించే షోడశ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమైయ్యాయి. వేడుకల్లో భాగంగా మంగళవారం సేవాకా లం, ప్రాభోదిక, యాగశాల ప్రవేశం, ద్వారతోరణపూజ, చతుస్థానఅర్చన, మూలమంత్రహోమం నిర్వహించారు. స్వామివారి మూలవిగ్రహానికి విశేషఫల పంచామృతాభిషేకం, తులసిపూజలు నిర్వహించి, చందనంతో స్వామివారిని అలంకరించారు. యాగశాలలో నిత్యపూర్ణాహుతి, ధ్వజారోహణం, మంగళశాసనం చేశారు. లక్షతులసీ పూజ నిర్వహించి జ్వాలా లక్ష్మీనరసింహ హోమాన్ని రుత్వికులు శాస్త్రోక్తంగా చేపట్టారు. సాయంత్రం సామూహిక విష్ణు సహస్రనామపారాయణం, చతుస్థాన అర్చన, చక్రాబ్జి మండలారాధన, నిత్యహోమం, నిత్యపూర్ణాహుతి, భేరితాండవం తదితర ప్రత్యేకపూజలు దేవాలయ అర్చకుడు భార్గవ్ ఆధ్వర్యంలో ఆగమ శాస్త్రానుసారంగా పాంచాహ్నిక దీక్షలతో అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. సుగంధపుష్పాలతో అలంకరించిన శేషవాహనంపై స్వామివారి విగ్రహాలను అలంకరించి దేవాలయంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి రాఘవ, కార్యవర్గ సభ్యులు గోవర్ధన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జేఎన్‌టీయూ వీసీ పదవీకాలం

- విద్యార్థి సంఘాల హర్షం.. టపాసులు కాల్చి సంబురాలు
- మరో నెలరోజులు పొడిగించినట్లు యూనివర్సిటీలో ప్రచారం



హైదరాబాద్ సిటీ, మే 21(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్‌గా డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి పదవీకాలం మంగళవారంతో ముగిసింది. 2021 మే 22న బాధ్యతలు స్వీకరించిన ఆయన మూడేళ్ల పాటు వీసీగా కొనసాగారు. మరోనెల రోజుల పాటు ప్రభుత్వం ఈయన పదవీకాలం పొడిగించే అవకాశం ఉందని రెండ్రోజులుగా యూనివర్సిటీలో ప్రచారం సాగింది. పదవీకాలం పొడిగింపు వచ్చిందని వీసీ అనుకూల వర్గం, లేదని వ్యతిరేక వర్గం పెట్టిన మెసేజ్‌లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎక్స్‌టెన్షన్ ఆర్డర్ రాకపోవడంతో వీసీ అనుకూల వర్గం వర్సిటీలో ఆయనకు ఘనంగా సన్మాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పూలబొకేలు, శాలువలు తీసుకుని పలువురు డైరెక్టర్లు, రిజిస్ట్రార్, రెక్టార్ తదితరులు సన్మానవేదిక వద్ద ఎదురుచూశారు. వీసీ కట్టా నర్సింహారెడ్డి ఎంతకీ రాకపోవడంతో ఆ కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. ఈ లోగా జేఎన్‌టీయూకు ఇన్‌చార్జ్ వీసీగా ఐఏఎస్ అధికారిని నియమించారనే వార్త రావడంతో మాజీ వీసీ 'కట్టా'కి వ్యతిరేక వర్గంగా ఉన్న కొన్ని విద్యార్థి సంఘాల ప్రతినిధులు టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.

రైతాంగ సమస్యలపై ఐక్య పోరాటానికి సిద్ధం కావాలి

రైతు సంఘం నాయకులు మల్లారెడ్డి, సాగర్

రాంనగర్, మే 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు అవలంబిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయ రంగం సంక్షోభం ఎదుర్కొంటుందని, ఈ నేపథ్యంలో రైతాంగ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని రైతు సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, టి.సాగర్ పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ విస్తృత సమావేశం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 2020-21 నుంచి వ్యవసాయ ప్రణాళిక ప్రకటించడం గానీ, ఆన్‌లైన్‌లో పెట్టడం గానీ చేయడం లేదన్నారు. రాష్ట్రంలో ప్రతియేటా 4, 5 లక్షల ఎకరాలలో కల్తీ విత్తనాల వల్ల పంటలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెటింగ్ శాఖ ద్వారా రైతులకు విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అందించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, అరిబండి ప్రసాదరావు, పి.జంగారెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలి

బర్కత్‌పుర, మే 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 11 వర్సిటీల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ల సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని యూనివర్సిటీస్ టీచర్స్ అసోసియేషన్(సీ) తెలంగాణ స్టేట్ డిమాండ్ చేసింది. 7వ వేతన సవరణను అమలు చేయాలని కోరింది. మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఏ.పరశురామ్, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ధీకొండ తిరుపతి, డాక్టర్ నిరంజన్, వర్కింగ్ ప్రెసిడెంట్లు డాక్టర్ జితేందర్‌రెడ్డి, కరుణాకర్ మాట్లాడారు. రాష్ట్రంలో 1500 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు 25 ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని, వారికి జూనియర్ కాలేజీ లెక్చరర్ల కంటే తక్కువ వేతనాలు ఇస్తూ వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని వారు ఆరోపించారు. తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరిస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొందని, సీఎం రేవంత్‌రెడ్డి న్యాయం చేయాలని వారు కోరారు. సమావేశంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు డాక్టర్ భీమయ్య, డాక్టర్ శ్యామ్‌సుందర్, డా.రామకృష్ణయ్య పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి


మియాపూర్‌లో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జగదీశ్వర్‌గౌడ్ నాయకులు


గాజులరామారంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

శేరిలింగంపల్లి జోన్‌బృందం, మే 21 (ఆంధ్రజ్యోతి): భారత మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతిని శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన విగ్రహాలకు పూలమాలలు వేసి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకుడు మన్నేపల్లి సాంబశివరావు ఆధ్వర్యంలో మియాపూర్ మయూరినగర్‌లోని వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ చేశారు. నల్లగండ్లలోని పార్టీ కార్యాలయంలో జగదీశ్వర్‌గౌడ్ కార్పొరేటర్ పూజిత, పార్టీ నాయకులతో కలిసి రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. కొండాపూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

• రాజీవ్‌గాంధీ సేవలు చిరస్మరణీయం

గాజులరామారం: రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా గాజులరామారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలోని ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రావణ్ కుమార్, బండి శ్రీనివాస్‌గౌడ్, కృష్ణ, రంగారావు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

• పేట్‌బషీరాబాద్‌లో..

కొంపల్లి మున్సిపాలిటీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని కొంపల్లి కాంగ్రెస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు భైరి ప్రశాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఉపసర్పంచ్ గోపాల్‌రెడ్డి, జయభేరి గోపాల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, పాల్గొన్నారు.

• కాంగ్రెస్ నేతల ఘన నివాళి

బాలానగర్: రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవలు వెలకట్టలేనివని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు కొండకింది పుష్పారెడ్డి అన్నారు. బాలానగర్‌లో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



• కూకట్‌పల్లి: మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా కేపీహెచ్‌బీకాలనీలోని ఆయన విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి గాలి బాలాజీ ముఖ్యఅతిథిగా పాల్గొని రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్, గంధం రాజు, పీ.ఆర్.నాయుడు, పొడుగు అప్పారావు, మఖ్దుమ్, బచ్చు మల్లి, రామారావు, రంగస్వామి పాల్గొన్నారు.